# కరెంట్ అఫైర్స్

## 'సిగ్నేచర్ బ్రిడ్జి' ప్రారంభం

- దిల్లీ ఈఫిల్ టవర్‌గా, సివిల్ ఇంజినీరింగ్ అద్భుతంగా పేరుగాంచిన 'సిగ్నేచర్ బ్రిడ్జి'ని 2018, నవంబరు 4న దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రారంభించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యమునా నదిపై నిర్మించిన 'సిగ్నేచర్ బ్రిడ్జి'తో ఉత్తర, ఈశాన్య దిల్లీల మధ్య ప్రయాణ దూరం గణనీయంగా తగ్గనుంది.
- సిగ్నేచర్ బ్రిడ్జి భారత్‌లోనే మొదటి అసిమెట్రికల్ కేబుల్ స్టేయిడ్ బ్రిడ్జి (సమరూపరహిత తీగల వంతెన)గా గుర్తింపు పొందింది. దీని నిర్మాణ వ్యయం రూ. 1,594 కోట్లు.
- కేబుళ్లతో వేలాడే సిగ్నేచర్ బ్రిడ్జి మొత్తం పొడవు 575 మీటర్లు. వెడల్పు 35.2 మీటర్లు (8 వరుసల్లో వాహనాలు ప్రయాణించవచ్చు). బ్రిడ్జి పైభాగంలో 154 మీటర్ల ఎత్తులో పూర్తిగా గ్లాస్‌తో నిర్మించిన వ్యూబాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రఖ్యాత కుతుబ్‌మినార్ ఎత్తు కంటే రెండింతలు. ఇక్కడ సందర్శకుల కోసం ప్రత్యేకంగా సెల్ఫీస్పాట్‌లను ఏర్పాటు చేశారు.

## ఐటీయూలో మళ్లీ భారత్

- అంతర్జాతీయ టెలీకమ్యూనికేషన్స్ యూనియన్ (ఐటీయూ) కౌన్సిల్‌లో భారత్ మళ్లీ సభ్యత్వం దక్కించుకుంది. 2019 నుంచి 2022 వరకు నాలుగేళ్లపాటు ఈ సభ్యత్వం ఉంటుంది.
- 2018, నవంబరు 6న దుబాయ్‌లో జరిగిన ఐటీయూ సదస్సులో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 193 ఓట్లకు గాను భారత్‌కు 165 ఓట్లు వచ్చాయి. అంతర్జాతీయంగా ఎన్నికైన మొత్తం 48 దేశాల జాబితాలో ఎనిమిదో స్థానం దక్కించుకుంది.
- ఐటీయూ దక్షిణాసియా ప్రాంతీయ కార్యాలయం, టెక్నాలజీ ఇన్నోవేషన్ కేంద్రాన్ని దిల్లీలో ఏర్పాటు చేయాలని ఐటీయూ ఇటీవల నిర్ణయించింది.

## జాతీయ జర్నలిజం ప్రతిభా పురస్కారాలు

- 2018 సంవత్సరానికిగాను జాతీయ జర్నలిజం ప్రతిభా పురస్కారాలను ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) 2018, నవంబరు 5న ప్రకటించింది.
- పాత్రికేయ రంగంలో విశేష సేవలు అందించినందుకు హిందు గ్రూప్ ఛైర్మన్ ఎన్. రామ్‌కు ప్రతిష్ఠాత్మక రాజా రామ్మోహన్‌రాయ్ పురస్కారాన్ని ప్రకటించింది.
- గ్రామీణ పాత్రికేయ విభాగంలో రుబీ సర్కార్ (దేశ్‌బంధు పత్రిక), రాజేష్ పరశురామ్ జోష్టే (డైలీపుధారీ పత్రిక)లకు 'ఎక్స్‌లెన్స్ ఇన్ జర్నలిజం' అవార్డులను ప్రకటించింది. అభివృద్ధి పాత్రికేయ విభాగంలో వీఎస్ రాజేష్ (కేరళ కౌముది), ఫొటో జర్నలిజంలో సుభాష్ పాల్ (రాష్ట్రీయ సహారా), మిహిర్ సింగ్ (పంజాబ్ కేసరి)లకు అవార్డులు లభించాయి.
- వ్యంగ్య చిత్రాల విభాగంలో పి. నరసింహ (నవ తెలంగాణ) అవార్డుకు ఎంపికయ్యారు. పశ్చిమ్ బంగలో పంచాయతీ ఎన్నికల హింస నేపథ్యంలో ఆయన గీసిన కార్టూన్‌కు ఈ పురస్కారం దక్కింది.
- జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా నవంబరు 16న దిల్లీలో జరిగే కార్యక్రమంలో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

## ఐఎన్ఎస్ అరిహంత్ తొలి గస్తీ

- భారత నౌకాదళానికి చెందిన అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్ తన తొలి అణునిరోధక గస్తీని విజయవంతంగా పూర్తి చేసినట్లు 2018, నవంబరు 5న ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.

**అరిహంత్ విశేషాలు:**

- మన దేశ అణ్వాయుధ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిన తొలి స్వదేశీ తయారీ అణు జలాంతర్గామి అరిహంత్. ఇది విశాఖ పట్నం కేంద్రంగా సేవలు అందిస్తోంది. అరిహంత్ అంటే 'శత్రు సంహారిణి' అని అర్థం.

- 2009, జులై 26న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ విశాఖపట్నంలోని నౌకా నిర్మాణ కేంద్రం నుంచి అరిహంత్‌ను తొలిసారి సముద్రంలోకి పంపారు. అనేక పరీక్షల అనంతరం 2016లో ఐఎన్ఎస్ అరిహంత్‌ను నౌకాదళంలోకి తీసుకున్నారు.
- ఇప్పటికే ఆకాశం నుంచి మిరేజ్-2000 యుద్ధ విమానం, భూమి నుంచి అగ్ని బాలిస్టిక్ క్షిపణి ద్వారా అణ్వాస్త్రాలను ప్రయోగించే సామర్థ్యాలు భారత్‌కు ఉన్నాయి. ఇప్పుడు ఐఎన్ఎస్ అరిహంత్ కూడా పూర్తిగా విజయవంతం కావడంతో గాలి, భూమి, నీరు మూడింటిలో ఎక్కడి నుంచైనా అణ్వస్త్రాన్ని ప్రయోగించే సామర్థ్యం భారత్ సొంతమైంది.
- ప్రస్తుతం అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్‌లకు మాత్రమే గాలి, నీరు, భూమి నుంచి అణ్వస్త్రాలను ప్రయోగించే సామర్థ్యం ఉంది. ఈ జాబితాలో భారత్ ఆరో దేశంగా చేరింది.
- ఐఎన్ఎస్ అరిహంత్ బరువు 6 వేల టన్నులు, పొడవు 110 మీటర్లు, వెడల్పు 11 మీటర్లు. నీటిలో 24 నాటికల్ మైళ్లు, నీటి ఉపరితలంపై 12 -15 నాటికల్ మైళ్ల వేగంతో వెళుతుంది. ఇది చేసే శబ్దం పైకి వినిపించదు.
- నీటిలో 300 మీటర్ల లోతు వరకు వెళ్లగలదు. 83 మెగావాట్ల అణు విద్యుత్ రియాక్టర్ ఇందులో ఉంటుంది. ఉపరితలానికి రాకుండా సముద్రం గర్భంలోనే కొన్ని నెలల పాటు ప్రయాణించగలదు.
- ఐఎన్ఎస్ అరిహంత్ గరిష్ఠంగా 3,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపై దాడి చేయగలదు.
- అరిహంత్ నావికాదళ రహస్య ప్రాజెక్టు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వెస్సల్ (ఏటీవీ)లో భాగం. ఇది ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో ఉంటుంది. ఏటీవీ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతను విశాఖపట్నంలోని నౌకా నిర్మాణ కేంద్రానికి అప్పగించారు.

## శ్రీలంక పార్లమెంటు రద్దు

- శ్రీలంక పార్లమెంటును రద్దు చేస్తున్నట్లు అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ప్రకటించారు. తమ పార్టీ (యునైటెడ్ పీపుల్స్ ఫ్రీడమ్ అలయెన్స్ - యూపీఎఫ్ఏ) ప్రతిపాదించిన ప్రధాన మంత్రి అభ్యర్థికి తగినంత సంఖ్యాబలం లేపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.
- అధికారిక ప్రకటనపై ఆయన నవంబరు 9న సంతకం చేశారు. 225 మంది సభ్యులుండే పార్లమెంటు అర్ధరాత్రి నుంచే రద్దవుతుందని దానిలో పేర్కొన్నారు. వాస్తవంగా ప్రస్తుత పార్లమెంటు గడువు 2020 ఆగస్టు వరకు ఉంది.
- ప్రధాన మంత్రిగా ఉన్న రణిల్ విక్రమ సింఘేను ఆకస్మికంగా తొలగించి, ఆయన స్థానంలో మహింద రాజపక్సేను సిరిసేన నియమించడంతో శ్రీలంకలో రాజకీయం సంక్షోభం తలెత్తింది.

## అమెరికా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భారతీయుడు

- ముంబయికి చెందిన 27 ఏళ్ల సౌరబ్ నేత్రవల్కర్ అమెరికా జాతీయ క్రికెట్ సీనియర్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 2023 వన్డే వరల్డ్ కప్‌కు అర్హత టోర్నీ అయిన ఐసీసీ వరల్డ్ కప్ లీగ్ డివిజన్ 3 పోటీల్లో అతను యూఎస్ఏ క్రికెట్ జట్టుకు నాయకుడిగా వ్యవహరిస్తాడు.

### అమెరికా మధ్యంతర ఎన్నికలు

- 2018, నవంబరు 6న అమెరికాలో మధ్యంతర ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. 435 మంది సభ్యులున్న ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లో 35 స్థానాలకు ఈ ఎన్నికలు జరిగాయి.
- అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలకు రెఫరెండంగా భావించిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. విపక్ష డెమొక్రట్లు ప్రతినిధుల సభలో ఆధిక్యం సాధించగా, అధికార పక్షమైన రిపబ్లికన్లు సెనేట్‌లో పట్టు నిలబెట్టుకున్నారు.
- 435 స్థానాలున్న ప్రతినిధుల సభలో ప్రస్తుతం రిపబ్లికన్లకు 235 సీట్లు, డెమొక్రట్లకు 193 సీట్లు ఉన్నాయి. సభలో ఆధిక్యం కోసం 218 సీట్లు అవసరం. తాజా ఎన్నికల్లో డెమొక్రట్లు 226 స్థానాలను, రిపబ్లికన్లు 197 సీట్లను గెలుచుకున్నారు. మరికొన్ని స్థానాల్లో తుది ఫలితాలు ప్రకటించాల్సి ఉంది. కొత్త సభ జనవరిలో కొలువుదీరుతుంది.

## 'రీ ఇన్వెంటెడ్ టాయిలెట్ ఎక్స్‌పో'

- బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ 2018, నవంబరు 6న బీజింగ్‌లో 'రీ ఇన్వెంటెడ్ టాయిలెట్ ఎక్స్‌పో' (పునరావిష్కృత మరుగుదొడ్డి ప్రదర్శన) పేరిట ఒక సదస్సును నిర్వహించింది. పారిశుద్ధ్య రంగంలో సరికొత్త, చవకైన ఆవిష్కరణలను ఈ సందర్భంగా ప్రజల ముందుకు తీసుకొచ్చింది.

- మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రపంచ ధనికుల్లో ఒకరైన బిల్‌గేట్స్ ఈ సదస్సుకు మానవ వ్యర్థంతో కూడిన సీసాతో హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రపంచవ్యాప్తంగా సరిపడినన్ని మరుగుదొడ్లు లేక సతమతమవుతున్న తృతీయ ప్రపంచ దేశాల సమస్యపై అందరి దృష్టిని ఆకర్షించేందుకు ఆయన ఈ పనిచేశారు.
- చైనా అధ్యక్షుడు జీజిన్‌పింగ్ ప్రారంభించిన 'టాయిలెట్ విప్లవం'తో దేశంలో పారిశుద్ధ్యం గణనీయంగా మెరుగుపడుతోందని ఈ సదస్సులో బిల్‌గేట్స్ ప్రశంసించారు.

## దీపోత్సవ్ - 2018

- దీపావళి వేడుకల్లో భాగంగా 2018, నవంబరు 6న ఉత్తర్ ప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్వహించిన దీపోత్సవం గిన్నిస్ రికార్డు సృష్టించింది. అక్కడి సరయూ నదీ తీరంలో అయిదు నిముషాల్లోనే 3,01,152 దీపాలు వెలిగించి అయోధ్యవాసులు గిన్నిస్ ప్రపంచ రికార్డు సృష్టించారు. 2016లో హరియాణాలో 1,50,009 దీపాలతో దీపావళి నిర్వహించగా ఆ రికార్డును అయోధ్య దీపోత్సవ్ అధిగమించింది.
- భారత పర్యటనలో ఉన్న దక్షిణ కొరియా ప్రథమ పౌరురాలు కిమ్ జంగ్ సుక్, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లు దీపోత్సవ్ - 2018 కార్యక్రమానికి హాజరయ్యారు.
- ఫైజాబాద్ జిల్లా పేరును 'అయోధ్య'గా మార్చనున్నట్లు ఈ కార్యక్రమంలో యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net
www.eenadupratibha.net